# SWETCHA GORA EYE BANK

Established by **Vasavya Mahila Mandali**

*Life Member – Eye Bank Association of India*

*Membership No.Inst-L-763*

**Nasthika Kendram, Benz Circle, Vijayawada-520 010 A.P.**

**E-mail:**vasavya@swetchagoraeyebank.org **Ph:**2472370, 9704020303 **Website:**www.swetchagoraeyebank.org

| **Smt Chennupati Vidya Ex-M.P.** | **Smt G Rashmi** | **Dr G Samaram** |
|---|---|---|
| President | Secretary | Executive Director |


ప్రచురణార్థం

## స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ అధ్వర్యంలో
## ఆగస్టు 25 నుండి నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు

– ఆగస్టు 23, 2017

జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం, ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు నగరంలోని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన ప్రచార పక్షోత్సవాలని నిర్వహిస్తున్నది. ఈ పక్షోత్సవాలని పురస్కరించుకుని ఈ రోజు వాసవ్య మహిళా మండలి కాన్ఫెరెన్స్ హాలులో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంలో స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా।।సమరం మాట్లాడుతూ మన దేశంలో 35లక్షల మంది నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్నారని, ఇందులో సగం మంది చిన్నారులేనని అన్నారు. ఈ సంఖ్యకు తోడు ఏటా మరో 20వేల మంది నల్లగుడ్డు అంధత్వం ఉన్నవారు పెరుగుతున్నారని అన్నారు. మన భారతదేశంలో ఏటా 80–90లక్షలమంది మరణిస్తుండగా కేవలం 23వేల మంది మాత్రమే నేత్రదానం చేస్తున్నారన్నారు. నేత్రదానంలో దక్షిణాది రాష్ట్రాలు 43 శాతంతో ముందంజలో ఉన్నాయన్నారు. పూర్వంతో పోలిస్తే గత 4–5సంవత్సరాల నుండి నేత్రదానానికి సంసిద్ధత తెలిపేవారు పెరిగారన్నారు. ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారంగా భారతదేశంలో కార్నియా సేకరణలో తమిళనాడు 7434 నేత్రాలతో ముందంజలో ఉండగా ఆంధ్రప్రదేశ్ 6518తో ద్వితీయ స్థానంలో, గుజరాత్ 5631తో మూడవ స్థానంలో ఉన్నట్లు తెలిపిందన్నారు. మన ప్రక్కనే ఉన్న శ్రీలంక నేత్రదానంలో ఎంతో ముందంజలో ఉందని, 40 దేశాలకు నేత్రాలని అందచేస్తోందని తెలియచేసారు. భారత ప్రభుత్వం ఒక సంవత్సరాన్ని నేత్రదాన సంవత్సరంగా ప్రకటిస్తే నల్లగుడ్డు అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. ఏటా కనీసం 1–2 లక్షల మంది నల్లగుడ్డు అంధత్వం ఉన్నవారికి నేత్రదానంతో చూపుని ప్రసాదించగలిగితే అనతికాలంలోనే నల్లగుడ్డు అంధత్వాన్ని నివారించడం సాధ్యమన్నారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ద్వారా ఇంతవరకు 885మంది అంధులకి చూపుని ప్రసాదించడం జరిగిందన్నారు. ఈ పక్షోత్సవాల ప్రారంభ సభ ఈ నెల 24వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు వాసవ్య మహిళా మండలి కాన్ఫెరెన్స్ హాలులో జరుగుతుందని డా।।జి.సమరం ఈ రోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో తెలియచేసారు. ఈ ప్రారంభ సభలో విజయవాడ సిటి కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ గౌతమ్ సవాంగ్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీ జి.వి. రామారావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డా।।జి.సమరం తెలియచేసారు. ఈ ప్రారంభ సభకు శ్రీమతి చెన్నుపాటి విద్య అధ్యక్షత వహిస్తారని తెలియచేసారు. ఈ పక్షోత్సవాలలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు నేత్రదానంపై ఆగస్టు 30న వ్యాసరచన పోటీలు, 31న పెయింటింగ్ పోటీలు, సెప్టెంబర్ ఒకటిన పాటల పోటీలు, 2న క్విజ్ నిర్వహిస్తున్నామని డా।।సమరం తెలిపారు. ఈ పోటీలన్నీ మధ్యాహ్నం 2గంటల నుండి వాసవ్య మహిళా మండలిలో ఏర్పాటు చేస్తామని అన్నారు. సెప్టెంబర్ 6న వాసవ్య మహిళా మండలి కాన్ఫెరెన్స్ హాలులో నల్లగుడ్డు అంధత్వం ఉన్నవారికి స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తామని, ఇందులో ఎంపిక అయిన వారికి నల్లగుడ్డు మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని అన్నారు. వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో, ఆసుపత్రులలో, స్వచ్ఛంద సంస్థలలో, కార్పోరేట్ ఆఫీసులలో ఇంకా నగరంలోని పలు సెంటర్లలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో శ్రీమతి చెన్నుపాటి విద్య, డా।।మారు, డా।।దీక్ష, డా।।కీర్తి కూడా పాల్గొన్నారు.